# మాజీ ఎమ్మెల్యే కారును ఢీకొన్న లారీ

- రేణికుంట స్టేజీ వద్ద ప్రమాదం
- గన్‌మెన్లు, అనుచరులకు తప్పిన ప్రాణాపాయం

తిమ్మాపూర్, జూన్2: రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కారును ఓ లారీ ఢీకొన్నది. తిమ్మాపూర్ మండలం రేణికుంట స్టేజివద్ద రాజీవ్ రహదారిపై ఆదివారం ఈ ప్రమాదం జరిగింది. కారులోని ఎయిర్ బెలూన్స్ ఓపెన్ కావడంతో కారులో ఉన్న గన్‌మెన్లు, అనుచరులకు ప్రమాదం తప్పింది. ప్రమాద సమయంలో మాజీ ఎమ్మెల్యే చందర్, మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ వేరే కారులో వస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి లారీని స్టేషన్‌కు తరలించారు. కారు డ్రైవర్ అర్షద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎల్ఎండీ ఎస్ఐ చేరాలు తెలిపారు.



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

# ఎన్పీడీసీఎల్ ఏడీఈకి ఫస్ట్ ర్యాంకు

ఫర్టిలైజర్‌సిటీ, జూన్ 2 : తెలంగాణ ఎన్పీడీసీఎల్ సంస్థలో అత్యంత ప్రతిభకు గాను సుల్తానాబాద్ ఏడీఈ కే వెంకటేశ్వర్లుకు మొదటి ర్యాంకు లభించింది. ఈ మేరకు ఆదివారం వరంగల్ కార్పొరేట్ కార్యాలయంలో జరిగిన రాష్ట్ర అవతరణ వేడుకల్లో ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అవార్డును అందజేశారు. గోదావరిఖనికి చెందిన వెంకటేశ్వర్లు గోదావరిఖని ఎన్‌పీడీసీఎల్‌లో ఏఈ, ఏడీఈగా పనిచేసి గతేడాది సాధారణ బదిలీలో సుల్తానాబాద్‌కు వెళ్లారు. తనకు సహకరించిన అధికారులు, సిబ్బందికి వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న ఏడీఈ వెంకటేశ్వర్లు

# తమిళ నాడులో రాఘవాపూర్ ఒగ్గుడోలు కళాబృందం

పెద్దపల్లిరూరల్, జూన్ 2: తమిళనాడు రాజ్‌భవన్‌లో సౌత్‌జోన్ కల్చరల్ సెంటర్, తంజావూర్‌లో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పెద్దపల్లి మండలం రాఘవాపూర్‌కు చెందిన ఒగ్గుడోలు కళాకారులు పాల్గొన్నారు. శని, ఆది వారాల్లో జరిగిన కార్యక్రమాల్లో కుటం సదయ్య నేతృత్వంలోని 15 మంది సభ్యుల బృందం విన్యాసాలతో అలరించింది. వీరిని ఆ రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి జ్ఞాపికలు అందించి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కుంట రాజ్‌కుమార్, కుంట రమేశ్, వీరు రమేశ్, జంగిలి పోచాలు, ఎలబోయిన మనోహర్ ఉన్నారు.



తమిళనాడు రాజ్‌భవన్‌లో విన్యాసాలు ప్రదర్శిస్తున్న రాఘవాపూర్ ఒగ్గుడోలు కళాకారులు

# నిప్పుల నేలపై పచ్చని పందిళ్లు

- నల్లబంగారు నేలన హరిత సింగారం
- ఆరు కోట్ల మొక్కలు నాటిన సింగరేణి సంస్థ
- 12 ఏరియాల్లోని 34 ప్రదేశాల్లో ఫారెస్టులు
- సీఎండీ బలరాం.. హరితయజ్ఞ ఫలితం
- ఈ యేడు మరో కార్యక్రమానికి శ్రీకారం



మొక్క నాటుతున్న సీఎండీ బలరాం

రాష్ట్రమంతటా ఎండలు ఒకెత్తయితే.. సింగరేణిలో మండే ఎండలు మరో ఎత్తు. ఈ ప్రాంతంలో నమోదయ్యే గరిష్ఠ ఉష్ణోగ్రతల గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అటు కాలుష్యం, ఇటు తీవ్ర ఎండలతో సింగరేణి ప్రాంత ప్రజల పరిస్థితి తలుచుకుంటేనే భయానకం. అయినా, ఇక్కడివాళ్లు ఎంతో కొంత ఉపశమనం పొందుతున్నారంటే ఆయా ప్రాంతాల్లో సింగరేణి సంస్థ పెంచిన వనాలే కారణం. ఇప్పటి వరకు సింగరేణి సంస్థ 6 కోట్ల మొక్కలు నాటగా, దీనివెనుక పర్యావరణ ప్రేమికుడు, సంస్థ సీఎండీ బలరాం చొరవ ప్రత్యేకం. ఆయన కృషితో నిప్పుల నేలపై పచ్చని పందిళ్లు పరుచుకున్నాయి. నల్లనేలన హరిత యజ్ఞాన్ని కొనసాగిస్తున్న సింగరేణి సీఎండీ ఎన్ బలరాం, 2024 -25లో 'ప్రతి అడుగు పచ్చదనం' నినాదంతో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారు.

**- హైదరాబాద్, జూన్ 2**
**నమస్తే తెలంగాణ**

## మండే మట్టికి చల్లదనం

భగభగ మండే మట్టిపై పచ్చదనాన్ని పెంచి చల్లదనాన్ని పంచాలన్నదే బలరాం అభిమతం. ఇందుకోసం సింగరేణి ఏరియాల్లో మొక్కలు నాటే మహాయజ్ఞాన్ని ఐదేండ్లుగా కొనసాగిస్తున్నారు. సింగరేణి వ్యాప్తంగా తానొక్కడే 18వేల మొక్కలు నాటి పచ్చదనం ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్నారు. సింగరేణి వ్యాప్తంగా 12 ఏరియాల్లోని 34 ప్రదేశాల్లో మినీ ఫారెస్టులను రూపొందించారు.

## పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా..

మహబూబ్‌నగర్ జిల్లాలో కడుపేద గిరిజన కుటుంబంలో జన్మించిన బలరాంకు సంక్షేమ హాస్టల్లో చదువుతున్నప్పటి నుంచే మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణపై ఆసక్తి. సింగరేణి డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొక్కలు నాటే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టారు. 2019లో ప్రపంచ పర్యావరణ దినోత్సవమైన జూన్ 5న కొత్తగూడెంలోని బంగ్లాస్ ఏరియాలో 108 మొక్కలు నాటి వృక్ష మహాయజ్ఞానికి శ్రీకారం చుట్టారు. ఆ తర్వాత శ్రీరాంపూర్ ఉపరితల గని మట్టికుప్పపై 2019 జూలై 20న గంటల వ్యవధిలోనే 1,237 మొక్కలు నాటి అందర్నీ ఆశ్చర్యచకితులను చేశారు. అదేరోజు జైపూర్ ఎస్టీపీపీలో 501 మొక్కలు, ఇలా ఒకే రోజు 1,700కు పైగా మొక్కలు నాటారు. 2021 జూలై 24న రామగుండంలో 12వేల మొక్కలు నాటగా, 2022 ఫిబ్రవరిలో కొత్తగూడెం బంగ్లాస్ 205 గులాబీ మొక్కలను (రోజ్‌గార్డెన్) మియావాకి పద్ధతిలో నాటారు. నాటిన మొక్కలకు జియోట్యాగింగ్ కూడా చేశారు. బలరాం సేవలకు పలు అవార్డులు దాసోహమయ్యాయి. అంతరించిపోతున్న అనేక జాతుల మొక్కలను బలరాం పరిరక్షిస్తున్నారు. జమ్మి, రావి, మర్రి, జువ్వి, సీమ చింత, వేప వంటి 20 జాతుల మొక్కలను పెద్ద ఎత్తున నాటారు. కోతులకు ఆహారం అందించేందుకు ఆర్కే-5 గని (శ్రీరాంపూర్) సమీపంలో 600కు పైగా పండ్ల మొక్కలు నాటగా వాటిలో కొన్ని ఫలాలనిస్తున్నాయి. పక్షులు, జంతువులకు ఇవి ఆలవాలమవుతున్నాయి. నాటిన ప్రాంతాల్లో 90శాతానికి పైగా మొక్కలు ఎదిగాయి.



సింగరేణి ప్రాంతంలో పరుచుకున్న పచ్చదనం



శాత్రాజుపల్లి పాఠశాలలో జెండా ఆవిష్కరణ అనంతరం సిబ్బందితో హెచ్ఎం సత్తవ్వ

# అవతరణోత్సవాలకు వెళ్లి వస్తూ..

- రోడ్డు ప్రమాదంలో మహిళా హెచ్ఎం దుర్మరణం
- కరీంనగర్ జిల్లా వెలిచాల ఎక్స్‌రోడ్డు వద్ద ప్రమాదం

రాంనగర్, జూన్ 2: తాను పనిచేస్తున్న స్కూల్‌లో ఆవతరణోత్సవాల్లో పాల్గొని తిరిగివస్తున్న ప్రధానోపాధ్యాయురాలు రోడ్డు ప్రమాదంలో మృత్యుఒడికి చేరారు. ఆర్టీసీ బస్సు, స్కూటీ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామడుగు మండలం వెలిచాలకు చెందిన తాళ్లపల్లి సత్యవ్వ (54) రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం శాత్రాజుపల్లి జడ్పీహెచ్ఎస్ స్కూల్లో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్నది. ఆదివారం ఉదయం స్కూటీపై వెళ్లి ఆవతరణోత్సవాల్లో పాల్గొన్నది. జాతీయ జెండాను ఆవిష్కరించిన తర్వాత తిరిగి వెలిచాలకు వస్తుండగా కొత్తపల్లి ఎక్స్‌రోడ్ వద్ద స్కూటీ, ఆర్టీసీ బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయి. స్కూటీని బస్సు కొంత దూరం వరకు ఈడ్చుకుంటూ వెళ్లడంతో ఆమె తలకు, కాళ్లు చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్షంగా చూసిన ఇద్దరు యువకులు '108'కు ఫోన్‌చేయగా అంబులెన్స్‌లో ప్రభుత్వ దవాఖానకు, అక్కడి నుంచి మెరుగైన చికిత్సకోసం ప్రతిమ దవాఖానకు తరలించారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం చికిత్సపొందుతూ సత్తవ్వ మరణించింది. ఆమె కొడుకు నీరజ్ ఫిర్యాదు మేరకు పంచనామా నిర్వహించిన కొత్తపల్లి పోలీసులు ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు డ్రైవర్ దుస్స రాజుపై కేసు నమోదు చేసి విచారణ జరుగుతున్నట్లు ఎస్ఐ సాంబమూర్తి తెలిపారు.

# ఫోర్జరీ కేసులో ఏడుగురి అరెస్ట్

అంతర్గాం, జూన్ 2: మండలంలోని టీటీఎస్ అంతర్గాం గ్రామ పంచాయతీ కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసి ఇంటి నెంబర్లు అక్రమంగా అన్‌లైన్ చేసిన కేసులో ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు రామగుండం సీఐ అజయ్‌బాబు తెలిపారు. ఈ మేరకు ఆయన ఈ కేసు వివరాలను ఆదివారం వెల్లడించారు. గత నెల 27న పంచాయతీ కార్యదర్శి ఇరుగురాల అనుజ అనుమతి లేకుండా గ్రామ పంచాయతీలో పనిచేసే కారోబార్ బాణాల మహేశ్, సర్పంచ్ కుర్ర వెంకటమ్మ, ఆమె భర్త కుర్ర నూకరాజు, పెరుమాళ్ల శేషికుమార్ దాదాపు 30 మంది వ్యక్తుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేసి కార్యదర్శి ఐడీ, పాస్‌వర్డ్‌ను ఉపయోగించి దొంగ ఇంటి నెంబర్లను ఆన్‌లైన్ చేశారు. కార్యదర్శి సంతకం, స్టాంప్‌ను ఫోర్జరీ చేసి కుర్ర నూకరాజు తన ఇంటి నంబర్‌ను రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు కార్యదర్శి అంతర్గాం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ వెంకటస్వామి కేసు నమోదు చేసి గోదావరిఖని ఏసీపీ ఎం రమేశ్ ఆదేశాల మేరకు సీఐ ఆధ్వర్యంలో ఎస్ఐ దర్యాప్తు చేశారు. ఈ కేసులో టీటీఎస్ అంతర్గామ్‌కు చెందిన కుర్ర నూకరాజు, పెరుమాళ్ల శశికుమార్, కుర్ర మాధ్యూ, కుర్ర వెంకటమ్మ, బాణాల మహేందర్ అలియాస్ మహేశ్, బ్రాహ్మణపల్లికి చెందిన మద్ది అరుణ్‌గౌడ్, గోదావరిఖని పరుశరాంనగర్ నివాసి, ఎంపీడీవో కార్యాలయం కంప్యూటర్ ఆపరేటర్ మారుమవుళ్ల సుమంత్ విచారణలో నిందితులుగా బయట పడటంతో వారిని ఆదుపులోకి తీసుకున్నారు. శనివారం గోదావరిఖని ప్రిన్సిపల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. వీరంతా ఒక ముఠాగా ఏర్పడి టీటీఎస్ అంతర్గాం ఇందిరమ్మకాలనీలో తక్కువ ధరకే ప్లాట్లు ఇచ్చి ఇంటి నంబర్ ఇస్తామని అమాయక ప్రజలను మోసం చేసి డబ్బులు తీసుకొని అక్రమంగా ఇంటి నెంబర్లు కేటాయించినట్లు సీఐ వివరించారు.

## రాబడి



# దీర్ఘకాలిక పెట్టుబడులే మేలు

## స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌పై నిపుణుల సలహా

**దేశీయ** స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టాలనుకునే మదుపరులు.. దీర్ఘకాలిక పెట్టుబడులపై దృష్టి సారించాలని మెజారిటీ నిపుణులు సూచిస్తున్నారు. ఇటీవలే మునుపెన్నడూ లేనివిధంగా బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 76,000 మార్కును, నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 23,100 స్థాయిని తాకిన విషయం తెలిసిందే. దీంతో ఈ ర్యాలీ వెనుక ఆకర్షణీయమైన కార్పొరేట్ త్రైమాసిక ఫలితాలు, బలమైన ఆర్థికాంశాలున్నాయని ఎక్స్‌పర్ట్స్ విశ్లేషిస్తున్నారు. ఈ క్రమంలోనే రిటైల్ ఇన్వెస్టర్లు.. క్వాలిటీ స్టాక్స్‌ను కొనేందుకున్న అవకాశాలను పరిశీలించాల్సిందిగా సలహా ఇస్తున్నారు. కార్పొరేట్ బ్యాలెన్స్ షీట్లు ఐదేండ్ల క్రితంతో పోల్చితే క్లీన్‌గా ఉన్నాయని, విస్తరణకు వీలు కూడా ఉందంటున్న విశ్లేషకులు.. ఈ కంపెనీల షేర్లలో పెట్టుబడులకు ఇదే సరైన సమయమని కూడా చెప్తున్నారు. కాగా, ఎన్నికలు, ఫలితాల దృష్ట్యా కొద్ది రోజుల వరకు మార్కెట్లలో ఒడిదొడుకులు తప్పవని కూడా పేర్కొంటున్నారు.

### ఈ రంగాల్లో..

ఆటోమోటివ్, రియల్టీ, క్యాపిటల్ గూడ్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, కన్జ్యూమర్ డిస్క్రీషియనరీ షేర్లు ఆకర్షణీయంగా ఉన్నాయి. బ్యాంకింగ్, ఫైనాన్షియల్స్, ఎఫ్ఎంసీజీ, ఐటీ, కెమికల్స్ రంగాల షేర్లలోనూ పెట్టుబడులకు వీలున్నది. కాబట్టి ఇన్వెస్టర్లు తమ ఆర్థిక లక్ష్యాలకు, అందుబాటులో ఉన్న నగదు నిల్వలకు, రిస్కును భరించే స్థాయికి అనుగుణంగా పెట్టుబడులకు వెళ్లవచ్చు. నిజానికి ఈ ఏడాదిలో ఇప్పటిదాకా బీఎస్ఈ సెన్సెక్స్ 4 శాతం వరకు పుంజుకున్నది. భారతీయ ఈక్విటీల్లో నుంచి విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపరులు (ఎఫ్‌పీఐ) తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నా సూచీలు రికార్డు గరిష్ఠాలకు చేరడం కలిసొచ్చే అంశమేనని చెప్పవచ్చు. ఈ ఏడాదిలో ఇప్పటిదాకా ఎఫ్‌పీఐలు దాదాపు రూ.21,000 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు మరి.

**కంపెనీలు** తమ త్రైమాసిక ఆర్థిక ఫలితాలను ప్రకటిస్తున్నాయి. చాలా సంస్థలు ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. రిటైల్ ఇన్వెస్టర్లు దీర్ఘకాలిక పెట్టుబడులకే వెళ్లాలి. సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల (సిప్)ను పరిశీలించవచ్చు. అవకాశాలను సద్వినియోగం చేసుకుని లాభాలను ఆర్జించవచ్చు.

*-తేజస్ ఖోడే,*
*ఫేర్స్ వ్యవస్థాపక సీఈవో*



**స్టాక్** మార్కెట్లు పెరగడం వెనుక బలమైన కారణాలే ఉన్నాయి. కనుక ఇది నిలకడైన ర్యాలీగానే చెప్పుకోవచ్చు. ముందుందు సూచీలు మరింతగా పెరిగే వీలుందనే అనుకుంటున్నా. కాబట్టి దీర్ఘకాలిక పెట్టుబడులకు అనువుగానే భావించవచ్చు. ఇక ఈక్విటీల్లో రిటైల్ ఇన్వెస్టర్ల భాగస్వామ్యం తక్కువగా ఉన్నది. ఇంకా పెరగాలి.

*-ఉపాసన భరద్వాజ్,*
*కొటక్ మహీంద్రా బ్యాంక్ ప్రధాన ఆర్థికవేత్త*



**పోర్ట్‌ఫోలియోల్లో** వైవిధ్యం, బలమైన మూలాలున్న క్వాలిటీ స్టాక్స్‌లో పెట్టుబడులు, ఊహాజనిత ట్రేడింగ్‌కు దూరంగా ఉండటం వల్ల స్టాక్ మార్కెట్ రిస్కులను మదుపరులు అధిగమించవచ్చు. ముఖ్యంగా స్వల్పకాలిక పెట్టుబడులకు వెళ్లకుండా కనీసం 2-3 ఏండ్లైనా దీర్ఘకాలిక పెట్టుబడులకు వెళ్లాలి.

*-వినాయక్ మెహెతా,*
*ఇన్ఫినిటీ గ్రూప్ వ్యవస్థాపక డైరెక్టర్*



# మీ వాహనానికి థర్డ్-పార్టీ ఇన్సూరెన్స్ ఉందా?

**దేశంలో** వాహనదారులకు మోటార్ బీమా తప్పనిసరి. మీకు కారున్నా.. బైకున్నా.. లేదా మరే వాహనం ఉన్నా.. వెహికిల్ ఇన్సూరెన్స్ నుంచి మాత్రం తప్పించుకోలేరు. ఇది మోటార్ వెహికిల్స్ యాక్ట్ 1988 నిబంధన. కాబట్టి ప్రతీ వాహనదారునికి మోటార్ ఇన్సూరెన్స్‌పై అవగాహన ఉండాల్సిందే. అయితే చాలామంది మొక్కుబడిగా ఏదో ఓ ఇన్సూరెన్స్‌ను తీసుకుని సరిపెట్టుకుంటున్నారు. ట్రాఫిక్ చలాన్ల నుంచి బయటపడితే చాలన్నట్టు వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా థర్డ్-పార్టీ ఇన్సూరెన్స్‌ను తీసుకునేందుకు పెద్దగా ఎవరూ ఆసక్తి కనబర్చడం లేదు. ఈ రకమైన వైఖరి చాలాచాలా నష్టపరుస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### సమగ్ర పాలసీ అవసరం

కార్ ఇన్సూరెన్సైనా, బైక్ ఇన్సూరెన్సైనా సమగ్ర రీతిలో ఉండాలి. మీరు తీసుకున్న వెహికిల్ ఇన్సూరెన్స్ మీ వాహనానికి ఓ భద్రతా వలయంలా రక్షణనివ్వాలి. కేవలం థర్డ్-పార్టీ ఇన్సూరెన్స్‌పైనే దృష్టి పెట్టకూడదు. ఉదాహరణకు ఒకవేళ మీ ఇంటి బయట పార్క్ చేసిన కారుపై దగ్గర్లోని ఓ చెట్టు కొమ్మ విరిగిపడింది. దీని వల్ల కారుకు బాగానే నష్టం వాటిల్లింది. లేదా ఉదయం లేచిచూసేసరికి మీ అపార్ట్‌మెంట్ అవతలనున్న మీ బైక్‌ను దొంగిలించారు. ఇలాంటి సందర్భాల్లో మీరు తీసుకునే బీమానే మీకు రక్ష. అలాగే వరదలు, భూకంపాల వంటి ప్రకృతి విపత్తులు, అల్లర్ల వంటి వాటిలో నష్టం జరిగినా వాహన బీమా వర్తిస్తుందన్నది మరువద్దు. కాబట్టి అన్ని కోణాల్లో ఆలోచించి, ఆరా తీసి ఓ సమగ్ర పాలసీని తీసుకోవాలి.




### పాలసీ కొనుగోలులో ఈ పొరబాట్లు వద్దు

- మీ ప్రాధాన్యతలను గుర్తించకపోవడం
- అసంపూర్ణ కవరేజీతో కూడిన పాలసీలు
- యాడ్-ఆన్ కవరేజీని నిర్లక్ష్యం చేయడం
- వివిధ పాలసీలు, వాటి ప్రీమియంలను పరిశీలించకపోవడం
- నో క్లెయిమ్ బోనస్‌లను పట్టించుకోకపోవడం

### థర్డ్-పార్టీ బీమా అంటే?

కార్ ఇన్సూరెన్స్, బైక్ ఇన్సూరెన్స్‌ల్లో థర్డ్-పార్టీ బీమా చాలా ముఖ్యమైనది. మోటార్ ఇన్సూరెన్స్‌లో ఫస్ట్-పార్టీ వాహన యాజమాని (ఇన్సూరెన్స్‌ను కొన్నవారు). సెకండ్-పార్టీ ఇన్సూరెన్స్‌ను అమ్మినవారు (బీమా సంస్థ). థర్డ్-పార్టీ ఏదైనా ప్రమాదంలో మీ వాహనం వల్ల నష్టపోయినవారు, గాయాలపాలైనవారు, చనిపోయినవారు. చికిత్సకు వైద్య ఖర్చులు, ఆస్తి నష్టానికి నగదును ఈ కవరేజీలో బీమా సంస్థనే అందిస్తుంది. థర్డ్-పార్టీ ఇన్సూరెన్స్ లేకపోతే ఈ ఖర్చులన్నీ వాహనదారుడి నెత్తిపైనే పడుతాయి. కనుక తప్పకుండా అత్యుత్తమ బీమాను తీసుకోవాలి. గడువు దాటక ముందే రెన్యువల్స్ చేస్తూపోవాలి. అయితే ప్రమాదంలో మీకు (ఇన్సూరెన్స్‌ను కొన్నవారు), మీ వాహనానికి జరిగిన నష్టం మాత్రం థర్డ్-పార్టీ ఇన్సూరెన్స్ పరిధిలోకి రాదు.

### ఇది గుర్తుంచుకోండి..

సరైన వాహన బీమా పాలసీని తీసుకోవడం వల్ల మీ కారు, బైక్‌లకే కాదు.. మీకూ అనేక లాభాలుంటాయి. కాబట్టి మార్కెట్‌లో అందుబాటులో ఉన్న వివిధ రకాల మోటార్ ఇన్సూరెన్స్‌లను క్షుణ్ణంగా పరిశీలించి ఓ నిర్ణయానికి రావాలి. ఈ క్రమంలో క్యాష్‌లెస్ గ్యారేజ్ నెట్‌వర్క్స్, ప్రీమియం ధరలు, యాడ్-ఆన్ ఫీచర్లు, బీమా సంస్థకున్న విశ్వసనీయత, కవరేజీ వంటి వాటిని ప్రధానంగా పరిగణనలోకి తీసుకోవాలి. కాగా, మెకానికల్ లేదా ఎలక్ట్రికల్ బ్రేక్‌డౌన్ జరగడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండానే వాహనం నడిపి ప్రమాదాలకు గురికావడం, మద్యం సేవించి వాహనాలు నడుపడం వంటి నిబంధనల ఉల్లంఘనల్లో కవరేజీలు వర్తించవు.

# నెలకు 2 లక్షల పెన్షన్ కావాలా?

## ఎన్‌పీఎస్ రిటైర్మెంట్ ప్లాన్ తెలుసుకోండిలా..

**ప్రస్తుతం** మీ వయసు 30 ఏండ్లైతే.. మీ పదవీ విరమణ అనంతరం నెలకు రూ.2 లక్షల పెన్షన్ కోసం రూ.5 కోట్ల కార్పస్ ఫండ్ అవసరం.

ఇందుకు నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) అనువైనదిగా చెప్పవచ్చు. ఎన్‌పీఎస్ అనేది స్టాక్ మార్కెట్ లింక్డ్ స్కీమ్. ఇందులో పెట్టిన పెట్టుబడుల సగటు వార్షిక వృద్ధి ఏటా 10 శాతంగా ఉంటున్నది. అందుకే మెరుగైన మీ పెన్షన్ అవసరాలకు ఎన్‌పీఎస్ సరైనదని ఆర్థిక నిపుణులు సైతం అంటున్నారు.

### నెలకు రూ.22,150

నెలనెలా దాదాపు రూ.22,150ని పెట్టుబడిగా పెడితే 30 ఏండ్లలో మీ పెట్టుబడులు రూ.5 కోట్లకు చేరుతాయి. చక్రవృద్ధి ప్రయోజనం ఇదే మరి. 30 ఏండ్లలో మీ పెట్టుబడులు రూ.79.74 లక్షలు. దీనిపై ఏటా 10 శాతం వృద్ధితో మరో రూ.4.21 కోట్లు సమకూరుతాయి. దీంతో కార్పస్ ఫండ్ రూ.5 కోట్లుగా ఉంటుంది. అప్పుడు నెలనెలా మీ రిటైర్మెంట్ వయసులో రూ.2 లక్షల పెన్షన్‌ను అందుకోవచ్చని పర్సనల్ ఫైనాన్స్ ఎక్స్‌పర్ట్స్ చెప్తున్నారు.

### ఇదీ సంగతి..

మీరు రిటైరైనప్పుడు మీకు రెండు మార్గాలుంటాయి. అవి ఓ యాన్యుటీ ప్లాన్‌లో మీ మొత్తం సొమ్మును పెట్టుబడిగా పెట్టి పెన్షన్ తీసుకోవడమో లేదా రిటైరైన తర్వాత వచ్చిన ఆ సొమ్ములో 60 శాతం ఉంచుకుని, మిగతా 40 శాతంతో యాన్యుటీ ప్లాన్‌లో చేరడమో అవుతుంది. అయితే ప్రస్తుత ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డీ) రేట్లను గమనిస్తే.. ఇంకా 6-7 శాతంగానే ఉన్నాయి. ఎఫ్‌డీల్లో నగదును పెట్టడం సురక్షితమే అయినా.. ఆశించిన లేదా ఆకర్షణీయ రాబడులు రావు. దీనికన్నా ఎన్‌పీఎస్‌లో పెట్టుబడులతో ఎక్కువ ఆదాయం పొందవచ్చు. అయితే ఎన్‌పీఎస్.. మార్కెట్ రిస్కులకు లోబడి ఉంటుంది. అయినప్పటికీ దీర్ఘకాలంలో మెరుగైన రాబడులనే అందిస్తుందన్న నమ్మకం పెట్టుకోవచ్చు. కానీ పెట్టుబడులకు దిగే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకుంటే మరింత ధీమాగా ఉండవచ్చు.



## మార్కెట్ పల్స్

# ఫలితాలే దిక్సూచి

**గత** వారం దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలనే చవిచూశాయి. లోక్‌సభ ఎన్నికల భయాల నడుమ మదుపరులు లాభాల స్వీకరణకే పెద్దపీట వేశారు. దీంతో అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,449.08 పాయింట్లు క్షీణించి 73,961.31 వద్ద స్థిరపడింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 426.40 పాయింట్లు పతనమై 22,530.70 దగ్గర నిలిచింది. ఈ క్రమంలో ఈ వారం కూడా సూచీలు నష్టాలనే మూటగట్టుకోవచ్చన్న అంచనాలున్నాయి. మంగళవారం ఎన్నికల ఫలితాలు రానుండటంతో ఒడిదొడుకులకూ వీలున్నదని ఎక్స్‌పర్ట్స్ అభిప్రాయపడుతున్నారు. గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు ఈ వారం కూడా మార్కెట్లను నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 22,100 పాయింట్ల స్థాయి కీలకం. దీనికి దిగువన ముగిస్తే 21,900 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 23,000-23,200 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

